ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 18 సంచిక: 362 | శుక్రవారం, 29 ఆగస్ట్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com

## సిరిసిల్లలో వరదలు..

వరదల్లో చిక్కుకున్న పశువుల కాపర్లు
హెలికాప్టర్లతో ఐదుగురిని కాపాడిన ఆర్మీ
కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవతో
సహాయక చర్యలు వేగవంతం
రెస్క్యూకు ముందు డ్రోన్లతో బాధితులకు
ఆహారం అందించిన అధికారులు

02

## జగిత్యాల జిల్లాలో

స్థంభంపల్లి పెద్ద చెరువుకు పొంచి ఉన్న ప్రమాదం
ఎడతెరిపి వర్షాలతో జలదిగ్బంధంలో జగిత్యాల జిల్లా
స్థంభంపల్లి పెద్ద చెరువుకు పెరుగుతున్న ప్రమాదం
కట్ట బలహీనతపై ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు
రెడ్ అలెర్ట్ నేపథ్యంలో తక్షణ చర్యలు కోరుతున్న ప్రజలు

# వరద బీభత్సం

## కామారెడ్డిలో క్లౌడ్ బరస్ట్

రెండు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు
నీట మునిగిన గ్రామాలు.. ఇళ్లు ఖాళీ చేస్తున్న ప్రజలు
నిజాంసాగర్, కౌలాస్ నాలా గేట్లు ఎత్తడంతో మంజీరాకు పోటెత్తిన వరద
వందలాది కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు
గుళ్లు, బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్న బాధితులు

02



## సహాయక చర్యలు అంతంత మాత్రమే

గల్లంతైన వారికి
కుటుంబీకులకు ప్రభుత్వ
ఉద్యోగం ఇవ్వాలి
జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి
ఇచ్చే కోటి
సరిపోతుందా
బ్రిడ్జి పునరుద్ధరణ
పనులు చేపట్టాలి
అత్యవసర పరిస్థితుల్లో
తప్ప బయటికి రావొద్దు
ఎంపీ రఘునందన్ రావు



**మెదక్, ఆగస్టు 28 (ప్రజా స్వరం) :** భారీ వర్షాలతో మెదక్ పట్టణం, పరిసర ప్రాంతాలు అతలాకుతలమయ్యాయని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. గురువారం హవేలీ ఘనపూర్ మండలంలో భారీ వర్షాలు దెబ్బ తిన్న బ్రిడ్జి లను ..మిగతా 2లో

## ఈ సమయంలో ఒలింపిక్స్‌పై సమీక్షనా?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై
బీఆర్ఎస్ నేత కేటీఆర్
తీవ్ర విమర్శలు
రోమ్ నగరం తగలబడుతుంటే
నీరో చక్రవర్తి ఫిడేలు
వాయించినట్టు సీఎం తీరు
భారీ వర్షాలతో కామారెడ్డి
పట్టణానికి పూర్తిగా
నిలిచిపోయిన రాకపోకలు
ప్రజలు కష్టాల్లో ఉంటే ఒలింపిక్స్,
మూసీ సుందరీకరణపై
సమావేశాలా అని ప్రశ్న
మరో నాలుగు రోజులు వర్ష
సూచన ఉన్నా ప్రభుత్వానికి
పట్టడం లేదని ఆరోపణ



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రజలు భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ముఖ్యమంత్రి మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. రోమ్ నగరం అగ్నికి ఆహుతవుతుంటే నీరో చక్రవర్తి ..మిగతా 2లో

# అధికారుల సేవలు అభినందనీయం

## సహాయక చర్యల్లో జిల్లా పాలన యంత్రాంగం భేష్



ప్రజలకు ఏ చిన్న సమస్య
వచ్చినా వెంటనే స్పందించాలి
నష్టపరిహారానికి
ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
హై లెవెల్ బ్రిడ్జిలు కట్టడానికి
శాశ్వత పరిష్కారం
తెలంగాణ ముఖ్యమంత్రి
అనుముల రేవంత్ రెడ్డి

**మెదక్, ఆగస్టు 28 (ప్రజా స్వరం) :** జిల్లాలో భారీ వర్షాలు వరదల సహాయక చర్యల్లో పాలన యంత్రాంగం తీరు అభినందనీయం సీఎం రేవంత్ రెడ్డి కితాబిచ్చారు. గురువారం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో హెలికాప్టర్ ద్వారా పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడం జరిగింది. మొదటగా గౌరవ వందన స్వీకరించిన ముఖ్యమంత్రి నీ అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు స్వాగతం పలికారు. అనంతరం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో అధికారులతో జిల్లాలో భారీ వర్షాలు వరదలపై సమీక్షించారు. భారీ వర్షాలు వరదల కారణంగా ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలని సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా సంభవించే వే ప్రకృతి విపత్తులు అని అటువంటి విపత్తుల సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ..మిగతా 2లో



## హెలికాప్టర్ పంపలేదు.. ప్రాణాలు పోయాయి

ప్రజల ప్రాణాలు పోతుంటే
రేవంత్ రివ్యూలతో కాలక్షేపం
రోమ్ తగలబడుతుంటే నీరో
చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారు
ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మెదక్‌లో
ఇద్దరు చనిపోయారని ఆరోపణ
మాజీ మంత్రి, సిద్దిపేట
ఎమ్మెల్యే హరీశ్ రావు

02



## తిట్టుకోవడమే పని

పార్టీలు గెలిచాయి..
ప్రజలు మాత్రం గెలవలేదు
బాధిత కుటుంబానికి
లక్ష నష్ట పరిహారం ఇవ్వాలి
ప్రజాశాంతి పార్టీ
అధ్యక్షుడు కేఏ పాల్

03


# హైదరాబాద్‌లో బీచ్



రూ.225 కోట్లతో ఆర్టిఫిషియల్‌గా నిర్మాణం!
కొత్వాల్ గూడా సమీపంలో 35 ఎకరాల్లో..
నీటిపై తేలియాడే విల్లాలు.. బంగీ జంపింగ్ కూడా..
పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు సర్కార్ సన్నాహాలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం) :** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు బీచ్ రాబోతోంది. ఏమిటీ.. అసలు సముద్రమే లేని మహా నగరానికి బీచ్ రావడమేంటీ.. అనుకుంటున్నారా..? అవునండీ.. మీరు చదివేది నిజమే.. కాకపోతే ఇది ఆర్టిఫిషియల్ బీచ్. విశ్వ నగరంగా విస్తరించిన గ్రేటర్ హైదరాబాద్ కు ఏదైనా కొదవ ఉందంటే.. అది బీచ్ ఒక్కటే. సముద్ర మట్టానికి సుమారు 700 అడుగుల ఎత్తులో దక్కన్ పీఠభూమిపై విస్తరించిన భాగ్యనగరానికి ఇక ఆ లోటు తీరబోతోంది.

04



## జంటకు 'ముగ్గురు' అవసరం

హిందూ జంటలకు
భగవత్ పిలుపు
దేశ భద్రత కోసం
ఇది అవసరం
ప్రపంచంలో భారత్
నెంబర్ 1 కానుంది
సంఘ్ 100వ
వార్షికోత్సవంలో కామెంట్స్

02

## 'స్థానిక' ఓటర్ల జాబితా సవరణను వాయిదా వేయాలి

వర్షాలతో ప్రజలు జాబితాలో తమ వివరాలు సరిచూసుకోలేరు
నీళ్లలో మునిగిన చాలా పంచాయితీ కార్యాలయాలు
రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు బీఆర్ఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్ ఆగస్టు 28 (ప్రజాస్వరం):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను భారత రాష్ట్ర సమితి కోరింది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, డాక్టర్ శ్రావణ్ దాసోజు గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఒక లేఖను అందజేశారు. కొన్ని రోజులుగా ఎడతెరిపి ..మిగతా 2లో



# 'స్థానిక' ఓటర్ల జాబితా సవరణను వాయిదా వేయాలి

**మొదటిపేజీ తరువాయి**

లేకుండా కురుస్తున్న వర్షాలతో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, ఆసిఫాబాద్, నిర్మల్, భూపాలపల్లి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు వరద గుప్పిట్లో చిక్కుకున్నాయని లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వరదలతో లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయని, వేలాది పశువులు మృత్యువాత పడ్డాయని, రోడ్లు, నీటిపారుదల వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయని వివరించారు.

తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు తమ ప్రాణాలను, ఆస్తులను, పశువులను, పంటలను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నారని, ఓటర్ జాబితాలో తమ వివరాలను తెలుసుకునే అవకాశం లేదన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను చేపట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ (No. 548/TGSECPR/2025) ప్రకారం ఓటర్ల జాబితా సవరణకు ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు కేవలం ఐదు రోజుల గడువు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. రాబోయే 35 రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, ఈ ప్రక్రియలో ప్రజలు గానీ, అధికారులు గానీ ఈ ప్రక్రియలో పాల్గొనడం అసాధ్యమని తెలిపింది. చాలా పంచాయతీ కార్యాలయాలు నీట మునిగి ఉన్నాయని, జాబితాల పరిశీలన కష్టమని వివరించింది.

క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు స్థానిక సంస్థల ఓటర్ల జాబితా రూపకల్పన, ప్రచురణ ప్రక్రియను తక్షణమే వాయిదా వేయాలని ఎన్నికల కమిషన్‌ను బీఆర్ఎస్ పార్టీ కోరింది. వరద పరిస్థితిని సమీక్షించిన అనంతరం, జిల్లా కలెక్టర్లతో సంప్రదించి కొత్త షెడ్యూల్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేసింది. ఓటర్లు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ అధికారులు పూర్తి స్థాయిలో పాల్గొనేలా పారదర్శకమైన వాతావరణంలో ఈ ప్రక్రియను భవిష్యత్తులో చేపట్టాలని సూచించింది. ప్రస్తుత విపత్తు సమయంలో ప్రజలను మరింత ఇబ్బంది పెట్టకుండా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను వాయిదా వేసి, పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు విజ్ఞప్తి
చేశారు.

**ఓటర్ జాబితాలో బీఆర్ఎస్ ఓట్లు గల్లంతు కాకుండా చూడాలి**

స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనలో అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకులతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే దురుద్దేశంతో బీఆర్ఎస్ సానుభూతిపరులు, కార్యకర్తల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఓటర్ జాబితాలో పేరు లేని వారు తమ అభ్యంతరాలను చెప్పుకోవడానికి తక్కువ గడువు విధించడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తుందన్నారు. ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, ఎల్. రమణతో పాటు బీఆర్ఎస్ లీగల్ సెల్ ఇంఛార్జ్, జనరల్ సెక్రటరీ భరత్ కుమార్ లతో కేటీఆర్ ఓ కమిటీ ఏర్పాటుచేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా ముసాయిదాలో ఏమన్న అవకతవకలు, అక్రమాలు జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయకులు ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండలస్థాయిలో ఎన్నికల సంఘం అధికారులతో రాజకీయ పార్టీల సమావేశాలు జరుగుతాయని జిల్లా స్థాయి నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు లేదా పార్టీ ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. అధికారుల నుంచి ముసాయిదా ఓటర్ల జాబితాను వెంటనే సేకరించి, దాన్ని గ్రామశాఖ నాయకులకు పంపాలని సూచించారు. ఓట్లు ఉన్నాయో లేదో క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఓట్లు గల్లంతైనట్లు తేలితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆగస్టు 31వ తేదీలోగా సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో అధికారికంగా అభ్యంతరాలను నమోదు చేయించాలని ఆదేశించారు.

# హైదరాబాద్‌లో బీచ్

**మొదటిపేజీ తరువాయి**

కూడా తీరబోతోంది. నగర శివారులో ఆర్టిఫిషియల్ బీచ్ ఏర్పాటు కాబోతోంది.

**కొత్వాల్‌గూడలో..**

నగర శివారులోని కొత్వాల్‌గూడలో ఆర్టిఫిషియల్ బీచ్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సమాచారం. సుమారు 35 ఎకరాల్లో రూ.225 కోట్ల వ్యయంతో బీచ్ నిర్మించనున్నట్లు తెలిసింది. బీచ్ పనులు డిసెంబరులో మొదలుకానున్నట్లు సమాచారం. ఈ ఆర్టిఫిషియల్ బీచ్‌లో ఫ్లోటింగ్ విల్లాస్, లగ్జరీ హోటళ్లు, వేవ్ పూల్స్, థియేటర్లు, ఫుడ్ కోర్టుల వంటివి చేర్చనున్నట్లు తెలుస్తోంది.

**పర్యాటక రంగానికి పెద్దపీట**

తెలంగాణలో కోటలు, వారసత్వ ప్రదేశాలు, పర్యావరణ పర్యాటక గమ్యస్థానాలు సహా రూ. 15,000 కోట్లకు పైగా విలువైన పర్యాటక సామర్థ్యం ఉంది. ఇక కృత్రిమ బీచ్ కూడా అందుబాటులోకి వస్తే.. ప్రపంచ పర్యాటక ప్రదేశాల లీగ్‌లోకి హైదరాబాద్ ప్రవేశించినట్లే.

# హెలికాప్టర్ పంపలేదు.. ప్రాణాలు పోయాయి

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**




రాష్ట్రంలో వరదలతో ప్రజల ప్రాణాలు పోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షల పేరుతో కాలక్షేపం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా" సీఎం తీరు ఉందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఒకవైపు ప్రజలు వరదల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోతుంటే, సీఎం మాత్రం మూసీ సుందరీకరణ, ఒలింపిక్స్ నిర్వహణపై సమీక్షలు చేయడం దారుణమని అన్నారు. మెదక్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో బీఆర్ఎస్ బృందంతో కలిసి పర్యటించిన హరీశ్ రావు, రాజాపేట గ్రామంలో వరద నీటిలో కొట్టుకుపోయి మరణించిన సత్యం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇద్దరు అమాయకులు చనిపోయారని ఆరోపించారు. "రాజాపేటలో వరద ఉధృతికి ఇద్దరు వ్యక్తులు కరెంట్ స్తంభం ఎక్కి ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నించారు. దాదాపు నాలుగు గంటల పాటు సహాయం కోసం ఎదురుచూశారు. ఈ విషయం గురించి జిల్లా కలెక్టర్‌కు, ఇతర అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవరూ స్పందించలేదు. చివరకు ఆ స్తంభం కూడా కొట్టుకుపోవడంతో వారు ప్రాణాలు విడిచారు" అని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరాలకు వాడాల్సిన హెలికాప్టర్‌ను పంపి ఉంటే వారి ప్రాణాలు దక్కేవని, కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదని ఆయన అన్నారు. ఒక మంత్రి హెలికాప్టర్లను అత్యవసరాలకు మాత్రమే వాడాలని చెబుతారని, కానీ అధికార పార్టీ నేతలు మాత్రం పెళ్లిళ్లకు, బీహార్ రాజకీయాలకు వాటిని వాడుతున్నారని విమర్శించారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు కనీసం తాగడానికి నీరు లేక వర్షపు నీటినే తాగుతున్నారని, ధూప్ సింగ్ తాండా లాంటి అనేక గ్రామాలు సహాయం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని కోరారు.

# వరద బీభత్సం

- స్థంభంపల్లి పెద్ద చెరువుకు పొంచి ఉన్న ప్రమాదం
- ఎడతెరిపి వర్షాలతో జలదిగ్బంధంలో జగిత్యాల జిల్లా
- స్థంభంపల్లి పెద్ద చెరువుకు పెరుగుతున్న ప్రమాదం
- కట్ట బలహీనతపై ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు
- రెడ్ అలెర్ట్ నేపథ్యంలో తక్షణ చర్యలు కోరుతున్న ప్రజలు



**జగిత్యాల,ప్రజాస్వరం:**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు జగిత్యాల జిల్లా ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. చెరువులు పొంగిపొర్లి గ్రామాలపై విరుచుకుపడుతుండటంతో పరిస్థితి దారుణంగా మారింది. రహదారులు దెబ్బతినగా, చిన్న చిన్న కాలువలు కూడా నదుల్లా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మొత్తం జిల్లా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ప్రత్యేకంగా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గ్రామంలోని పెద్ద చెరువుకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. బుధవారం (ఆగస్టు 27) రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెరువులోకి భారీగా వరద నీరు చేరింది. నీటి మట్టం వేగంగా పెరగడంతో మత్తడి దూకే స్థాయికి చేరుకుంది. అయితే చెరువు తూము వద్ద ఉన్న కట్ట ఇప్పటికే బలహీనంగా ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ముందు జాగ్రత్త చర్యగా బండ రాళ్లతో తెట్టె కట్టినప్పటికీ, మరోసారి భారీ వర్షం కురిస్తే నీరు ఆ తెట్టెను దాటుకుని చెరువులో ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. తూము పక్కన బలహీనంగా ఉన్న భాగం గుంతలోకి మరింత నీరు చేరితే కట్టకు గండి పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువుకు గండి పడితే వెల్గటూర్, కోటిలింగాల, పాశీగాం వంటి గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. అందువల్ల తక్షణమే అధికారులు చెరువు వద్దకు చేరుకుని కట్టను పర్యవేక్షించి, అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక ఇప్పటికే వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో, ఉన్నత స్థాయి అధికారులు వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

# సిరిసిల్లలో వరదలు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ రాష్ట్రం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరద నీటిలో చిక్కుకున్న ఐదుగురిని సైనిక హెలికాప్టర్లు గురువారం రక్షించాయి. గంభీరావుపేట మండలంలోని ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద బుధవారం నుంచి వరద ఉధృతిలో చిక్కుకున్న వీరిని రక్షించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పశువులను మేపేందుకు వెళ్లిన ఈ ఐదుగురు గ్రామస్థులు, అకస్మాత్తుగా పెరిగిన వరద ప్రవాహానికి చిక్కుకుపోయారు. విషయం తెలుసుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెంటనే స్పందించారు. ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడి, బాధితులను కాపాడేందుకు తక్షణమే హెలికాప్టర్లను పంపాలని విజ్ఞప్తి చేశారు. బండి సంజయ్ అభ్యర్థనపై రాజ్‌నాథ్ సింగ్ వెంటనే స్పందించి, సహాయక చర్యల కోసం రెండు హెలికాప్టర్లను పంపాలని రక్షణ శాఖ అధికారులను ఆదేశించారు. హెలికాప్టర్లు ఘటనా స్థలానికి చేరుకోవడానికి ముందు, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి. గీతే ఆధ్వర్యంలో అధికారులు డ్రోన్ల సహాయంతో బాధితులకు ఆహార పొట్లాలు, నిత్యావసరాలను అందించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బుధవారం బాధితులతో ఫోన్‌లో మాట్లాడి, వారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తామని ధైర్యం చెప్పారు. సహాయక చర్యల సమన్వయంపై ఐఏఎఫ్ ఎయిర్ కమోడోర్ వి.ఎస్. సైనీ, గ్రూప్ కెప్టెన్ చటోపాధ్యాయలతో బండి సంజయ్ సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా హెలికాప్టర్ల రాక ఆలస్యమైందని, నాందేడ్, బీదర్ వంటి ప్రత్యామ్నాయ కేంద్రాల నుంచి వాటిని తరలించేందుకు ప్రయత్నిస్తున్నామని వారు వివరించారు. సహాయక చర్యలు పూర్తయినప్పటికీ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆ రెండు హెలికాప్టర్లు సిరిసిల్లలోనే ఉంటాయని మంత్రి తెలిపారు. తక్షణమే స్పందించి సహాయం అందించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సహాయక చర్యలు అంతంత మాత్రమే





**మొదటిపేజీ తరువాయి**

ఆయన పరిశీలించారు. అనంతరం మెదక్ పట్టణంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న వారిని కలిసి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్నటువంటి పలు గ్రామాలకు సంబంధాలు తెగిపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన సహాయక చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయని అన్నారు. ప్రజలు మరింత సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నుంచి కోరుకుంటున్నారన్నారు. నిన్న సాయంత్రం గల్లంతైన వారిలో ఒకరి మృతదేహం మాత్రమే లభించందని మరొకరి మృతదేహం కోసం బృందాలు సాగిస్తున్నారు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని, ఆ వ్యక్తి కూడా ఈరోజు దొరకాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మృతి చెందిన బాధిత ఇద్దరి కుటుంబాలకు ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కింద మెదక్ పట్టణంలో ఉంచిన వారికి సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి వచ్చి కోటి రూపాయలు ఆపత్తు సహాయం కింద ప్రకటించారని అన్నారు. సరైన నివేదిక ఇంచార్జ్ మంత్రికి జిల్లా స్థానిక అధికారులు సరైన నివేదిక ఇచ్చినట్లు కనిపించడం లేదన్నారు. తాత్కాలిక మరమ్మత్తుల కోసమే మెదక్ పట్టణంలో నీట మునిగిన పిల్లికోటల్ లో సబ్ స్టేషన్ను పునరుద్ధరించాలంటే సుమారు మూడు కోట్ల వరకు ఖర్చవుతుందని అన్నారు. జిల్లాలో భారీ వర్షాల వల్ల రోడ్లు, బ్రిడ్జిలు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. వాటిని వెంటనే పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. మునిగినటువంటి మెదక్ పట్టణంలోని సబ్ స్టేషన్ ను ఎత్తైన ప్రాంతంలో నిర్మించాలన్నారు. కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, నడ్డా లతో మాట్లాడి వరద ప్రాంతాలకు హెలికాప్టర్లు, ఎన్డీఆర్ ఎఫ్ బృందాలను పంపాలని కోరినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప మిగతా సమయాల్లో బయటకు రావద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లాస్ మల్లేష్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షురాలు బెండ వీణ, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాయకులు కల్కి నాగరాజు, కాశీనాథ్, ప్రభాకర్, ఎం ఎల్ ఎన్ రెడ్డి, నందా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల సేవలు అభినందనీయం

**మొదటిపేజీ తరువాయి**



ఉండి ఎటువంటి ఆస్తి నష్టం పంట నష్టం ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం ఆస్తి నష్టం ప్రాణనష్టాన్ని అంచనాలకు అనుగుణంగా నష్టపరిహారానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. మెదక్ జిల్లాలో భారీగా వర్షాలు వరదలు ముంచేత్తుతున్న కారణంగా వాగులు చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ లో భాగంగా వరద నష్టాలను అంచనాలు వేస్తూ శాశ్వత ప్రాతిపదికన హై లెవెల్ బ్రిడ్జి లు కట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసినప్పుడు ఫోటో క్యాప్చర్ వీడియో క్యాప్చర్ ద్వారా జిల్లాలో జరిగిన సమగ్ర వివరాలను భద్రపరచాలని సూచించారు. వర్షపాత నమోదు వివరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పలు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాల యూరియా కొరత విషయంలో బఫర్ స్టాక్ డిస్ప్లే చేస్తూ ఉన్నామని రైతులు రాబోవు పంటలకు కూడా ఇప్పటి నుండే యూరియా కొనుగోలు చేయడం వల్ల కొరత ఏర్పడుతుందని నానో యూరియా పై రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు. చివరగా ఫ్లడ్ ఎఫెక్టెడ్ ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పౌరసరఫరాల శాఖ ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, అదనపు కలెక్టర్ నగేష్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఈ సమయంలో ఒలింపిక్స్‌పై సమీక్షనా?

**మొదటిపేజీ తరువాయి**

ఫిడేలు వాయించిన చందంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. భారీ వర్షాల కారణంగా కామారెడ్డి పట్టణానికి రోడ్డు మార్గాలన్నీ మూసుకుపోయి, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇటువంటి కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి, ఇతర అంశాలపై దృష్టి పెట్టడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా, ప్రభుత్వంలో మాత్రం ఎలాంటి చలనం లేదని కేటీఆర్ ఆరోపించారు. క్లిష్ట సమయంలో ప్రజల సమస్యలను పరిష్కరించడం విస్మరించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒలింపిక్స్ నిర్వహణ, మూసీ నది సుందరీకరణ వంటి అంశాలపై సమావేశాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని, రైతులకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం



# కామారెడ్డిలో క్లౌడ్ బరస్ట్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణలోని కామారెడ్డి జిల్లా విలవిల్లాడుతోంది. జిల్లాలోని ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, కౌలాస్ నాలా ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్న ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. డోంగ్లి మండలంలో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. సిర్పూర్, పెద్దటాక్లి, హాసన్ టాక్లి గ్రామాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో సిర్పూర్‌లో 246, పెద్దటాక్లిలో 190, హాసన్ టాక్లిలో 120 కుటుంబాలు తమ నివాసాలను ఖాళీ చేశాయి. కొందరు సమీపంలోని బంధువుల ఇళ్లకు వెళ్లగా, మరికొందరు డోంగ్లి మండల కేంద్రానికి చేరుకున్నారు. చిన్నారులు, వృద్ధులతో సహా పలువురు మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు, పిట్లం మండలం కుర్తి గ్రామం బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోయి పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది. ఈ వరద ప్రభావిత ప్రాంతాల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పర్యటించారు. ఆలయాల్లో తలదాచుకుంటున్న బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితుల కోసం తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వరద ఉధృతి కొనసాగుతుండటంతో ముంపు గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# ‘ఆ పార్టీలకు తిట్టుకోవడమే పని’.. కేఏ పాల్ సెన్సేషనల్ కామెంట్స్

**మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28(ప్రజాస్వరం):** రాష్ట్రంలోని మూడు పార్టీలు కూడా ఎన్నికల్లో హామీ ఇచ్చిన తర్వాత ప్రజలను మర్చిపోయారని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. గురువారం మెదక్ పట్టణంలో పునరావాసం పొందుతున్న వారిని ఆయన పరామర్శించారు. అనంతరం వారికి ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు రాజకీయ పార్టీలపై పూర్తిగా నమ్మకం పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ 12 సార్లు గెలిచింది. బీజేపీ నాలుగు సార్లు గెలిచింది. కేసీఆర్ రెండు సార్లు గెలిచారు. కానీ ప్రజలు మాత్రం ఇప్పటికీ గెలవలేదన్నారు. రాష్ట్రంలో ప్రజలకు తిండి బట్ట లేక, వర్షం వస్తే నివాసాల్లో ఉండలేక, అన్ని కోల్పోయి ఇంత ఇబ్బంది పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి బాధ్యత లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలకు బుద్ధి రావాలంటే కుల, అవినీతి, మత పార్టీలను భూస్థాపితం చేయాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పక్కన పెట్టారని మూడు పార్టీలు ఒకరినొకరు తిట్టుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. భారీ వర్షాల నేపథ్యంలో నష్టపోయిన కుటుంబాలకు లక్ష రూపాయల నష్టపరిహారం, ఇల్లు కోల్పోయిన వారికి ఇల్లు నిర్మించాలని అన్నారు.





# 1,071 మందిని కాపాడిన రెస్క్యూ బృందాలు

**హైదరాబాద్ ఆగస్టు 28(ప్రజాస్వరం):** రాష్ట్రంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా సహాయక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న 1,071 మందిని రెస్క్యూ బృందాలు సురక్షితంగా కాపాడినట్టు ప్రభుత్వం పేర్కొంది. అలాగే, వరద ప్రభావిత ప్రాంతాల్లో 1,000 మందికి ఆహార పదార్థాలు అందజేసినట్టు తెలిపింది. ఈ సహాయక చర్యల్లో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్), స్థానిక పోలీసు బృందాలు పాల్గొన్నట్టు ప్రభుత్వం తెలిపింది. అలాగే కొన్నిచోట్ల వరదలో చిక్కుకున్న వారికి డ్రోన్ల సహాయంతో ఆహార పదార్థాలు అందజేసినట్టు ప్రభుత్వం వెల్లడించింది. కామారెడ్డి, మెదక్, ఖమ్మం వంటి తీవ్ర వరద ప్రభావిత జిల్లాల్లో ఈ రెస్క్యూ ఆపరేషన్లు జరిగాయని ప్రభుత్వం పేర్కొంది.



# ఉత్తర తెలంగాణను ముంచెత్తిన భారీ వర్షాలు

**హైదరాబాద్ ఆగస్టు 28(ప్రజాస్వరం):** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు ఉత్తర తెలంగాణను ముంచెత్తుతున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శుక్రవారం అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. వీటిలో నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు ఉన్నాయి,. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఉమ్మడి కరీంనగర్, మెదక్, వికారాబాద్ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపింది.ఈ ఐదు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వాతావరణ కేంద్రం అంచనాలకు అనుగుణంగా తెలంగాణలో అతి భారీ వర్షాలు పడుతున్నాయి. 27 ఉదయం 8:30 గంటల నుంచి 28వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు రికార్డయిన అత్యధిక వర్షపాతం వివరాలను వాతావరణ కేంద్రం తాజాగా విడుదల చేసింది. కామారెడ్డి జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. రాజంపేట మండలం అర్గొండలో 43 సెంటిమీటర్ల వర్షం కురిసింది. నిర్మల్ జిల్లా నిర్మల్ రూరల్ మండలంలోని అక్కాపూర్‌లో 32 సెం.మీ, మెదక్ జిల్లా హవేలిఘనపూర్‌లోని సర్దానాలో 30 సెం.మీ, కామారెడ్డి టౌన్ ఐడీఓసీ వద్ద 28 సెం.మీ, నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్‌లో 27 సెం.మీ, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 27 సెం.మీ మేర వర్షపాతం నమోదైంది. మెదక్ జిల్లా హవేలిఘనపూర్‌లోని నాగపూర్‌లో 27 సెం.మీ, కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో 27 సెం.మీ, కామారెడ్డి పాత రాజంపేటలో 24 సెం.మీ, నిర్మల్ జిల్లా విశ్వనాథపేటలో 24 సెం.మీ, నిర్మల్ జిల్లా నిర్మల్ రూరల్ మండలంలోని ముజిగిలో 23 సెం.మీ, మెదక్ జిల్లా చేగుంటలో 22 సెం.మీ మేర వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా లింగం పేటలో 22 సెం.మీ, మెదక్ జిల్లా రామాయంపేటలో 20 సెం.మీ, మెదక్ ఆర్‌డీఓ కార్యాలయం వద్ద 20 సెం.మీ, కామారెడ్డి జిల్లా దోమకొండలో 20 సెం.మీ, మెదక్ జిల్లా రాజ్‌పల్లిలో 19 సెం.మీ కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలోని లాచాపెట్‌లో 19 సెం.మీ, కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో 18 సెం.మీ కురిసింది. సిద్దిపేట జిల్లా కొండపాకలో 18 సెం.మీ, కామారెడ్డి జిల్లా పల్వంచలోని ఏలుపుగొండలో 18 సెం.మీ, సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని కొడకండ్లలో 17 సెం.మీ, కుమరం భీమ్ జిల్లా రెబ్బెనలో 17 సెం.మీ, కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో 17 సెం.మీ, నిర్మల్ జిల్లా సారం గాపూర్‌లోని జామిలో 17 సెం.మీ వర్షం పడింది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో 17 సెం.మీ, సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో 17 సెం.మీ, కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లోని హసన్‌పల్లిలో 17 సెం.మీ, నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని పక్‌పట్లలో 17 సెం.మీ, నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో 170.0 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



# తెలంగాణ బీఎస్పీ చీఫ్‌గా ఇబ్రాం శేఖర్

**హైదరాబాద్,అగస్టు 28 (ప్రజాస్వరం):** తెలంగాణ బహుజన్ సమాజ్ పార్టీకి నూతన రథసారధి వచ్చారు. పార్టీ జనరల్ సెక్రెటరీతో పాటు బడంగ్‌పేట మున్సిపాలిటీకి డిప్యూటీ మేయర్‌గా పని చేసిన ఇబ్రాం శేఖర్‌ను అధ్యక్షుడిగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి నియమించారు. బుధవారం లక్నోలో జరిగిన సమావేశంలో ఈ ప్రకటనను అధికారికంగా వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర అధ్యక్ష పదవికి మంద ప్రభాకర్ రాజీనామా చేశారు. దీంతో నూతన అధ్యక్షుడు ఎంపిక అనివార్యం అయింది. దీంతో అధ్యక్ష పదవికి నామినేషన్లు తీసుకున్నారు. సుమారు ఎనిమిది మంది అధ్యక్ష పదవికి పోటీపడగా.. ఎప్పటి నుంచో అధ్యక్ష రేసులో ముందు వరుసలో ఉన్న ఇబ్రాం శేఖర్‌కే అవకాశం దక్కింది.

**2013లో బీఎస్పీలోకి ఎంట్రీ**

గతంలో ఎమ్మార్పీఎస్‌లో పనిచేసిన ఇబ్రాం శేఖర్.. 2013లో బీఎస్పీ ఫౌండర్ కాన్షీరాం ఆశయాలతో బీఎస్పీలో చేరారు. ఇక అప్పటి నుంచి పార్టీలో వివిధ పదవుల్లో కొనసాగుతూ వచ్చారు. రెండు సార్లు జనరల్ సెక్రెటరీగా, ఒకసారి స్టేట్ సెంట్రల్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బీఎస్పీ నుంచి పలుమార్లు ఎన్నికల్లో గెలిచిన ఏకైక నాయకుడిగా ఆయనకు మంచి పేరుంది.

**డిప్యూటీ మేయర్‌గా గెలవడం శేఖర్ రాజకీయ చతురత**

2006లో హైదరాబాద్ పరిధిలో ఉన్న బాలాపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్‌గా గెలిచిన ఇబ్రాం శేఖర్.. అనంతరం ఆ ప్రాంతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో విలీనం అయ్యాక 2013లో బాలాపూర్ మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచారు. ఇక 2020లో బడంగ్‌పేట్ మున్సిపాలిటీగా అవతరించడంతో మరోసారి కార్పొరేటర్‌గా గెలిచి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. బీఎస్పీ నుంచి ఒక్కడే గెలిచినప్పటికీ.. తన రాజకీయ చాకచక్యంతో డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకుని ఐదేళ్లు కొనసాగారు.

**బహుజనులకు రాజ్యాధికారమే నా సంకల్పం: ఇబ్రాం శేఖర్**

తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ప్రజలు అన్నిరంగాల్లో రాణించాలంటే రాజకీయంగా పురోగతి సాధించాలని బీఎస్పీ నూతన అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ వ్యాఖ్యానించారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కినపుడే ఆర్థిక, రాజకీయ, సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు. ఆధిపత్య అగ్రవర్ణాలు, రాజకీయ పార్టీలకు ఓట్లు వేసినంత కాలం బహుజనుల బతుకులు బాగుపడవని చెప్పుకొచ్చారు. భారత రాజ్యాంగాన్ని మేనిఫెస్టోగా కలిగిన ఏకైక పార్టీ బీఎస్పీనేనని వెల్లడించారు. ఓటు ఒక పోరాట సాధనమని, దాన్ని అమ్ముకోవడం తమను తాము అమ్ముకోవడమేనని చెప్పుకొచ్చారు. బహుజనుల ఓటును పదునైన ఆయుధంగా వాడి అధికారంలోకి రావాలన్నది బీఎస్పీ సిద్ధాంతమని ఉద్ఘాటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి మాయావతి మార్గనిర్దేశకత్వం చాలా అవసరమని పేర్కొన్నారు ఇబ్రాం శేఖర్.



**అందరికీ సామాజిక న్యాయం..**

‘సామాజిక న్యాయం అందరికీ అందాలంటే అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలి. బహుజన సమాజ నిర్మాణమే కర్తవ్యంగా పనిచేస్తున్న బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ప్రధాని అయితే, బలహీన, పీడిత వర్గాలకు రాజ్యాధికారం లభిస్తుంది. నా శక్తి, సామర్థ్యాలపై నమ్మకంతో మాయావతి, బీఎస్పీ ముఖ్య జాతీయ కన్వీనర్ ఆకాష్ ఆనంద్, బీఎస్పీ జాతీయ కోఆర్డినేటర్ రాజారం నాకు అత్యంత కీలకమైన అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను’ అని పేర్కొన్నారు. పార్టీలోని సీనియర్లు, మేధావులు పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారని, వారందరి సూచనలతో బీఎస్పీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి బలోపేతానికి కృషి చేస్తానని ఇబ్రాం శేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



# వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని రక్షించిన ఆర్మీ అధికారులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఆగస్టు 28(ప్రజాస్వరం):** రాజన్న సిరిసిల్ల గంభీరావుపేట మండలం నర్మల గ్రామంలోని అప్పర్ మానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకున్న ఏడుగురిని రాత్రిపూట ఉత్కంఠ భరితమైన ఆపరేషన్ తర్వాత ఆర్మీ హెలికాప్టర్ల సహాయంతో సురక్షితంగా రక్షించారు. బుధవారం ప్రాజెక్టుకు అవతలి వైపు పశువులను మేపడానికి వెళ్లిన జంగం స్వామి, పిట్ల స్వామి, పిట్ల మహేష్, పిట్ల నర్సింలు, ధ్యానబోయిన స్వామి, బిసే ప్రదీప్, బిసే ఛాయ అనే రైతులు చిక్కుకుపోయారు. అకస్మాత్తుగా వరదలు రావడంతో వారు తిరిగి రాలేకపోయారు. సిరిసిల్ల జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, ఆహారం అందించి, రాత్రంతా పరిస్థితిని పర్యవేక్షించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి. గీతే బుధవారం మధ్యాహ్నం నుండి తెల్లవారుజామున 2 గంటల వరకు సంఘటన స్థలంలోనే ఉండి, వ్యక్తిగతంగా సహాయ చర్యలను పర్యవేక్షిస్తూ, ఎన్డీఆర్ఎఫ్‌తో సమన్వయం చేసుకున్నారు. గురువారం ఉదయం, ఆర్మీ హెలికాప్టర్లు చిక్కుకున్న రైతులను విమానంలో తరలించి సురక్షితంగా తీసుకువచ్చాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సహాయక చర్యలను సమీక్షిస్తున్నారు. తరువాత, బండి సంజయ్ రక్షించబడిన గ్రామస్తులను కలుసుకుని అధికారులను అభినందించారు.



# ఉధృతంగా వాగు... జేసీబీలో నిండు గర్భిణి తరలింపు

**రాయికల్ ఆగస్టు 28(ప్రజాస్వరం):** పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు జెసిబి సాయంతో వాగు దాటించిన ఘటన జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని వడ్డే లింగాపూర్ గ్రామానికి చెందిన గుగ్లావత్ కళ్యాణి (25) అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు బయలుదేరారు. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రామాజీపేట శివారులో బ్రిడ్జి పై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు దాటే పరిస్థితి లేకపోవడంతో... జెసిబి తీసుకువచ్చారు స్థానిక యువత. అనంతరం జేసీబీలో గర్భిణిని తరలించారు. వాగు గట్టున అప్పటికే అంబులెన్స్ వచ్చి సిద్ధంగా ఉండడంతో కళ్యాణిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

# ప్రజలకు ఆరోగ్య శాఖ హెచ్చరిక


**హైదరాబాద్ ఆగస్టు 28(ప్రజాస్వరం):** తెలంగాణ అంతటా వచ్చే వారం పాటు నిరంతర వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేయడంతో రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. అనేక జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, రాబోయే రెండు రోజుల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితుల కారణంగా కాలానుగుణ, అంటు వ్యాధులు పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రజారోగ్య డైరెక్టర్ డాక్టర్ బి. రవీందర్ నాయక్ మాట్లాడుతూ... ఉష్ణోగ్రతలు తగ్గడం, తేమ పెరగడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, నీరు లేదా గాలి ద్వారా సంక్రమించే వ్యాధులు వ్యాప్తి చెందుతాయని అన్నారు. ఈ నేపథ్యంలో, వర్షాకాలంలో తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నివారణ చర్యలు తీసుకోవాలని ఆ శాఖ పౌరులను కోరింది. దోమల సంబంధిత వ్యాధులను నివారించడానికి, నివాసితులు దోమతెరలు, తెరలను ఏర్పాటు చేసుకోవాలని, వికర్షకాలను ఉపయోగించాలని, వారి ఇళ్లలో, చుట్టుపక్కల నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మురుగు కాలువలను శుభ్రంగా ఉంచాలి, దోమల పెరుగుదలను నివారించడానికి సెప్టిక్ ట్యాంకులను తగిన మెష్‌తో కప్పాలి. నిలిచి ఉన్న నీటిని శుభ్రం చేయడానికి ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కూడా ప్రజలను కోరారు. నీటి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్లను నివారించడానికి తాగునీటిని మరిగించడం, ఫిల్టర్ చేయడం, భోజనానికి ముందు, తరువాత చేతుల పరిశుభ్రత పాటించాలని సలహా ఇస్తుంది. ఈ సీజన్‌లో రోడ్డు పక్కన ఉన్న, మూత లేని ఆహారాన్ని తినకూడదని



పౌరులను హెచ్చరిస్తున్నారు. వైరల్ జ్వరాలు, శ్వాసకోశ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండటానికి, ప్రజలు అనారోగ్యంతో ఉన్నప్పుడు కరచాలనం చేయకుండా ఉండాలని, క్రమం తప్పకుండా శానిటైజర్లను ఉపయోగించాలని, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు నోటిని రుమాలుతో కప్పుకోవాలని ఆ శాఖ సూచించింది. జ్వరం, దగ్గు, తలనొప్పి లేదా గొంతు నొప్పితో బాధపడుతున్న వ్యక్తులు వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని ఆరోగ్య అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో, ప్రజలు 108 అంబులెన్స్ సేవలను డయల్ చేయడం ద్వారా సహాయం పొందవచ్చని అధికారులు సూచించారు. వైద్య సంసిద్ధతను బలోపేతం చేయడానికి, ప్రభుత్వం ప్రజారోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు, ఐవీ ద్రవాలు, ప్రత్యేక జ్వర వార్డుల తగినంత సరఫరాను నిర్ధారించింది. అంతేకాకుండా, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందితో సహా ఫ్రంట్‌లైన్ కార్మికులకు తక్షణ సమాజ స్థాయి సంరక్షణ కోసం మందులు, ఓఆర్ఎస్ సాచెట్లను అందించినట్లు ఒక పత్రికా ప్రకటన తెలిపింది. రాష్ట్రంలో సుదీర్ఘమైన వర్షాకాలంలో అంటువ్యాధులను అరికట్టడంలో సమిష్టి అప్రమత్తత, సకాలంలో వైద్య సహాయం కీలక పాత్ర పోషిస్తాయని డాక్టర్ నాయక్ పేర్కొన్నారు.

# 75 ఏళ్ల రిటైర్మెంట్ వ్యాఖ్యలపై స్పష్టతనిచ్చిన ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

- **తానుగానీ, ఇతరులుగానీ రిటైర్ అవ్వాలని ఎప్పుడూ చెప్పలేదన్న భగవత్**
- **ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని వెల్లడి**
- **గతంలో చేసిన వ్యాఖ్యలను తప్పుగా అన్వయించుకున్నారని వివరణ**
- **సంఘ్ చెప్పినంత కాలం పని చేస్తామని స్పష్టీకరణ**
- **మోరోపంత్ పింగళి సంఘటనను చమత్కారంగా చెప్పానన్న భగవత్**



**ఢిల్లీ ఆగస్టు 28(ప్రజాస్వరం):** రాజకీయాల్లో, సంస్థల్లో 75 ఏళ్లకు పదవీ విరమణ చేయాలని తాను వ్యాఖ్యానించినట్లుగా జరుగుతున్న ప్రచారంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ స్పష్టతనిచ్చారు. తాను గానీ, మరే ఇతర రాజకీయ నాయకులు గానీ 75 ఏళ్లకు రిటైర్ అవ్వాలని ఎన్నడూ చెప్పలేదని ఆయన తేల్చి చెప్పారు. వచ్చే నెలలో ప్రధాని నరేంద్ర మోదీ 75వ ఏట అడుగుపెడుతున్న నేపథ్యంలో, గతంలో భగవత్ చేసిన వ్యాఖ్యలు ఆయనను ఉద్దేశించినవేనని జరుగుతున్న ప్రచారానికి ఈ ప్రకటనతో తెరపడింది. గురువారం ఢిల్లీలో జరిగిన "100 వర్ష్ కీ సంఘ్ యాత్ర" కార్యక్రమంలో భగవత్ మాట్లాడుతూ, "నేను రిటైర్ అవుతానని గానీ, ఇంకెవరైనా రిటైర్ అవ్వాలని గానీ ఎప్పుడూ చెప్పలేదు" అని స్పష్టం చేశారు. గతంలో తాను ఆర్ఎస్ఎస్ మాజీ నేత మోరోపంత్ పింగళికి సంబంధించిన ఒక చమత్కారమైన సంఘటనను ఉదాహరించానని, దానిని చాలామంది తప్పుగా అన్వయించుకున్నారని వివరించారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పింగళి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సందర్భంగా ఆయనకు సంబంధించిన మూడు, నాలుగు సరదా సంఘటనలను పంచుకున్నానని గుర్తుచేశారు.

"మోరోపంత్ చాలా చమత్కారి. ఆయన మాటలతో కుర్చీలోంచి ఎగిరి గంతేసేలా చేసేవారు," అని భగవత్ అన్నారు. పింగళికి 75 ఏళ్లు వచ్చినప్పుడు, మరో సీనియర్ నేత హెచ్.వి. శేషాద్రి ఆయనకు శాలువా కప్పి ఇక బాధ్యతల నుంచి తప్పుకోవాలని సున్నితంగా సూచించిన సంఘటనను తాను సరదాగా చెప్పానని, అంతేకానీ దానిని ఒక నిబంధనగా పరిగణించరాదని ఆయన తెలిపారు.

సంఘ్ కార్య పద్ధతిని వివరిస్తూ, "సంఘ్‌లో మేమంతా స్వయంసేవకులం. మాకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఒక పని అప్పగిస్తారు. నాకు 80 ఏళ్లు వచ్చినా సరే, శాఖను నడపమంటే నడపాల్సిందే. మాకు ఏది చెప్పారో అది చేస్తాం" అని ఆయన అన్నారు. ప్రస్తుతం తాను సర్ సంఘ్‌చాలక్‌గా ఏకైక వ్యక్తిని అయినప్పటికీ, తన తర్వాత ఆ బాధ్యతలు చేపట్టేందుకు కనీసం 10 మంది సిద్ధంగా ఉన్నారని భగవత్ పేర్కొన్నారు. "సంఘ్ మమ్మల్ని ఎంతకాలం పనిచేయమంటే అంతకాలం పనిచేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని ఆయన పునరుద్ఘాటించారు.

# జలమయమైన సిద్దిపేట



- రాత్రంతా కుండపోత వర్షం
- మత్తడి దూకుతున్న కోమటి చెరువు
- చెరువు మత్తడి కాలువలు నిండి రోడ్డు పైకి నీళ్లు
- అప్రమత్తం అయిన అధికారులు, నాయకులు
- రోడ్డు పైకి నీరు రావడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు
- శ్రీనగర్ కాలనీలో ఇళ్లలోకి నీళ్లు

**సిద్దిపేట ఆగస్టు 28 (ప్రజాస్వరం):**

రాత్రి కుండపోతగా కురిసిన వర్షానికి జిల్లా కేంద్రం సిద్దిపేట లో పలు కాలనీలు జలమయం అయ్యాయి. నీట మునిగాయి .కొత్త బస్టాండ్, శ్రీనగర్ కాలనీ పాత బస్టాండ్ ముర్షతగడ్డ, లలో నీరు రోడ్లపైకి వచ్చాయి . కొందరి ఇళ్ల లోకి నీరు రావడంతో ప్రజలు ఆందోళన కు గురయ్యారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోమటి చెరువు నిండటంతో అలుగు పారడంతో కాలువలన్నీ నిండిపోయాయి వాటి నుంచి రోడ్డు మీద పోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి..గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సిద్దిపేట కోమటి చెరువు పొంగి పొర్లడంతో శ్రీనగర్ కాలనీ శ్రీనివాస నగర్ కాలనీ తోపాటు పలు కాలనీలలో భారీగా వరద నీరు చేరుకుంది. హైదరాబాదు రోడ్డులో (భావి ఇస్కాన్ పూల్) గల బ్రిడ్జిపై వరద పొంగి పొర్లడం తో, హైదరాబాద్ రోడ్లో కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు భారీగా నీరు రోడ్డుపైన మోకాల్లోతు నిలవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు గ్రామాల నుండి వచ్చినటు వంటి ప్రజలు కొత్త బస్టాండ్ వద్దనే బస్సులు ఆపడం తో కాలినడకన మోకాల్లో నీటిలో నడుచుకుంటూ పాత బస్టాండు చేరుకున్నారు.

**నీట మునిగిన ప్రాంతాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ హైమావతి**

శ్రీనగర్ కాలనీలో నీట మునిగిన ప్రాంతాన్ని ఒక ప్రవేట్ అపార్ట్మెంట్ పైన నుంచి వీక్షించి నీటమునిగినన కాలని వాసులను సురక్షిత ప్రాంతాలను తరలించడం కోసం ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను రప్పించి పునరావాస కేంద్రాల లోకి మళ్లించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

కోమటిచెరువు మత్తడి నుండి నీరు ఉదృతంగా వెళ్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే ఎన్సాన్పల్లి నుండి కోమటి చెరువు నీరు వచ్చే బ్రిడ్జి గుండా కాలువనిండ నీరు ఉదృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే శ్రీచైతన్య స్కూల్ ముందు భాగం లో ఉన్న కల్వర్టు గుండా నీరు ఉదృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి రోడ్ డ్యామేజ్ అయిన ప్రాంతంలో కోతకు గురికాకుండా ఇసుక బస్తాలు వెయ్యాలని అధికారులకు ఆదేశించారు.శ్రీనివాస్ నగర్ కాలనీలో నీట మునిగిన ప్రాంతాన్ని,లోహిత్ సాయి ఆసుపత్రి పైనుండి నర్సాపూర్ చెరువు నీట మునిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తూ కింద ఉన్న నర్సాపూర్ చెరువు మత్తడి ప్రాంతాన్ని పరిశీలించి నీరు వేగంగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కొత్త బస్టాండ్ నుండి మోడ్రన్ బస్టాండ్ మధ్యలో రోడ్ వెంబడి బ్రిడ్జి పైన నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించి నీటి ఉధృతి తగ్గేవరకు రాకపోకలు నిలిపివేయాలని పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. వీరు వెంట ఏసిపి రవీందర్, తహసీల్దార్ కిరణ్, పోలీస్ ఇతర శాఖల అధికారులు తదితరులున్నారు




















## జలదిగ్బంధంలో ఏడుపాయల వన దుర్గాభవాని ఆలయం

**మెదక్ జిల్లా ఆగస్టు 28(ప్రజాస్వరం):**

నాగుసానిపల్లిలో ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గా భవాని ఆలయం ఇంకా జలదిగ్బంధంలోనే ఉంది. గత 14 రోజులుగా మంజీరా నదిలో వరద ఉధృతి కొనసాగుతుండటంతో, ప్రధాన ఆలయంలోకి భక్తులకు దర్శనం కల్పించడం సాధ్యం కావడం లేదు.సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు, సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కారణంగా ఆలయం చుట్టూ భారీగా వరద నీరు ప్రవహించడంతో ఆలయ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురం వద్ద ఏర్పాటు చేశారు. గత రెండు వారాలుగా భక్తులు అక్కడే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం వరదల సమయంలో ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకోవడం పరిపాటే అయినప్పటికీ, ఇంత సుదీర్ఘ కాలం పాటు దర్శనాలు నిలిచిపోవడం అరుదు. వరద తగ్గుముఖం పడితేనే ప్రధాన ఆలయంలో దర్శనాలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## నీలి రంగు గుడ్డు పెట్టిన కోడి

**కర్ణాటక ఆగస్టు 28(ప్రజాస్వరం):**కర్ణాటకలోని దావణగేరేలో ఓ కోడి నీలం రంగు గుడ్డు పెట్టి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. చన్నగిరి తాలూకాలోని నల్లూర్ గ్రామానికి చెందిన సయ్యద్ నూర్‌కు చెందిన 10 కోడి పెట్టెల్లో ఒకటి నీలం రంగు గుడ్డు పెట్టింది. ఈ వార్త స్థానికంగా సంచలనం అయ్యింది. ఈ సంచలన వార్త జంతు సంరక్షణ అధికారులకు చేరింది. వారు వచ్చి కోడిని, గుడ్డును పరిశీలించారు. నీలం రంగు గుడ్డు అరుదని వారన్నారు. చన్నగిరి తాలూక అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ నేతృత్వంలోని బృందం గుడ్డును పరిశీలించింది. 'బిలివెర్డిన్' అనే పిగ్మెంట్ కారణంగానే ఈ నీలం రంగు గుడ్డును కోడి పెట్టిందని ఆయన వివరించారు. పిగ్మెంట్ కారణంగా కొన్ని కోడ్లు నీలం లేక ఆకుపచ్చని గుడ్లు పెట్టొచ్చని ఆయన ధ్రువీకరించారు.అయితే గుడ్డులో పోషక విలువలు ఏ మాత్రం తగ్గవని, సాధారణ గుడ్లలో ఉన్నట్టే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.



ఈ నీలం రంగు గుడ్డు అద్భుతాన్ని చూసేందుకు గ్రామస్థులు ఎగబడుతున్నారని సమాచారం. కొందరేమో ఈ నీలం గుడ్డు అదృష్టాన్ని ఇస్తుందని, మరి కొందరేమో శాస్త్రీయ వివరణ అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదిలావుండగా ఒకవేళ ఈ కోడి పెట్ట ఇదే మాదిరి నీలం రంగు గుడ్లను పెడుతుంటే దాని జన్యు, జీవరసాయన కారణాలు తెలుసుకునేందుకు అధ్యయనం చేస్తామని డాక్టర్ అశోక్ తెలిపారు. కాగా నీలం రంగు గుడ్డు పెట్టిన ఆ కోడి పెట్ట ఆరోగ్యాన్ని, డేటాని గమనిస్తుంటామని జంతు సంరక్షణ శాఖ హామీ ఇచ్చింది.

## హైదరాబాద్‌కు బీచ్.. 35 ఎకరాల్లో రూ.225 కోట్లతో నిర్మాణం!


హైదరాబాద్ ఆగస్టు 28(ప్రజాస్వరం): తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు బీచ్ రాబోతోంది. ఏమిటీ.. అసలు సముద్రమే లేని మహా నగరానికి బీచ్ రావడమేంటీ.. అనుకుంటున్నారా..? అవునండీ.. మీరు చదివేది నిజమే.. కాకపోతే ఇది ఆర్టిఫిషియల్ బీచ్ . విశ్వ నగరంగా విస్తరించిన గ్రేటర్ హైదరాబాద్ కు ఏదైనా కొదవ ఉందంటే.. అది బీచ్ ఒక్కటే. సముద్ర మట్టానికి సుమారు 700 అడుగుల ఎత్తులో దక్కన్ పీఠభూమిపై విస్తరించిన భాగ్య నగరానికి ఇక ఆ లోటు కూడా తీరబోతోంది. నగర శివారులో ఆర్టిఫిషియల్ బీచ్ ఏర్పాటు కాబోతోంది.

**కొత్వాల్‌గూడలో..**

నగర శివారులోని కొత్వాల్‌గూడలో ఆర్టిఫిషియల్ బీచ్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సమాచారం. సుమారు 35 ఎకరాల్లో రూ.225 కోట్ల వ్యయంతో బీచ్ నిర్మించనున్నట్లు తెలిసింది. బీచ్ పనులు డిసెంబరులో మొదలుకానున్నట్లు సమాచారం. ఈ ఆర్టిఫిషియల్ బీచ్‌లో ఫ్లోటింగ్ విల్లాస్, లగ్జరీ హోటళ్లు, వేవ్ పూల్స్, థియేటర్లు, ఫుడ్ కోర్టుల వంటివి చేర్చనున్నట్లు తెలుస్తోంది.

**పర్యాటక రంగానికి పెద్దపీట**

తెలంగాణలో కోటలు, వారసత్వ ప్రదేశాలు, పర్యావరణ పర్యాటక గమ్యస్థానాలు సహా రూ. 15,000 కోట్లకు పైగా విలువైన పర్యాటక సామర్థ్యం ఉంది. ఇక కృత్రిమ బీచ్ కూడా అందుబాటులోకి వస్తే.. ప్రపంచ పర్యాటక ప్రదేశాల లీగ్‌లోకి హైదరాబాద్ ప్రవేశించినట్లే.



## స్కాలర్‌షిప్స్, ఫీజు బకాయిలు చెల్లించాలి

**హైదరాబాద్ ఆగస్టు 28(ప్రజాస్వరం ):**రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు రూ. 6 వేల కోట్లు వెంటనే చెల్లించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. కొత్తగా 100 బిసి కాలేజీ హాస్టలు, 119 బిసి గురుకులాలు మంజూరు చేయాలని, బిసి గురుకులాల్లో 20 శాతం సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు మాసాబ్ ట్యాంక్ తెలుగు సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావడంతో పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్కాలర్ షిప్స్, ఫీజు బకాయిల పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ ద్వారా గ్రామాల్లో వ్యవసాయ కూలీల పిల్లలు, మెడిసన్, ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీలు చదువుతున్నారని, సమాజంలో గుణాత్మకమైన మార్పు ప్రారంభమైందని అన్నారు. బాల కార్మికులను అరికట్టడం జరిగిందని, ప్రతి ఒక్కరు ఉన్నత విద్య చదువుకుంటున్నారని, ఈ గుణాత్మకమైన మార్పును ఆహ్వానించేది పోయి చదువు కోకుండా అడ్డుకుంటున్నారని కృష్ణయ్య ఆరోపించారు. ఫీజ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు అష్ట కష్టాల పాలవుతున్నారని, ఫీజులు కట్టాలని విద్యార్థులపై యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయని, కోర్సు పూర్తైన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, సర్టిఫికెట్లు తెసుకోలేక కొందరు ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించక పోవడంతో కాలేజీ యాజమాన్యాలు అద్దె భవనాల అద్దె కట్టడం లేదని, లెక్చరర్ల జీతాలు నెలల తరబడి ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనేక పథకాలకు లక్షల కోట్ల అప్పు తెస్తున్న ప్రభుత్వం లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పథకానికి రూ. 6 వేల కోట్లు అప్పు తెస్తే ఎవరు అడ్డుకుంటారని కృష్ణయ్య ప్రశ్నించారు. ఒకవైపు ఫీజు బకాయిలు చెల్లించకుండా ఇంకొక వైపు



ఫీజుల స్కీములు ఎత్తివేయడానికి 'ట్రస్ట్ బ్యాంకు' ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని కొత్త నాటకానికి తెర లేపారని, ఈ ప్రతిపాదన ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని కృష్ణయ్య స్పష్టం చేశారు. కాలేజీ హాస్టల్లో గురుకుల పాటశాలలో సీట్లు రాక చాల మంది విద్యార్థులు చదువు మనుకుంటున్నారని, అదనంగా హాస్టల్స్ మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న బిసి, ఎస్సి, ఎస్టి గురుకుల పాఠశాలల్లో సీట్లు లభించక తెలుగు సంక్షేమ భవన్ చుట్టూ రోజుల తరబడి ప్రజలు తిరుగుతున్నారని, సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వసతి సౌకర్యం ఉన్నచోట అదనపు సెక్షన్లు ప్రారంభించాలని అలాగే ప్రతి క్లాసులో 20 శాతం సీట్లు అదనంగా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేముల రామకృష్ణ, గుజ్జ కృష్ణ, ససుధాకర్, నంద గోపాల్, యస్.రవి కుమార్ యాదవ్, చంద్ర శేఖర్, నిఖిల్, అరవింద్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# భార్యను తిడుతున్నారా... ఆలోచించండి!

భార్యభర్తల మధ్య గొడవలు రావటం సహజం. మాటమాట అనుకోవటం సహజం. కానీ, వివాదం వచ్చినప్పుడు నాదే పైచేయి కావాలన్న పట్టుదల ఉంటే, బంధం నిలవటం కష్టమవుతుంది. భార్యభర్తల మధ్య కొట్లాట జరుగుతున్నప్పుడు, భార్యను అనరాని మాటలతో, సూటిపోటి మాటలు అని ఆమె మనస్సును గాయాలయ్యేలా మాట్లాడుతారు. తరువాత పర్యవసనాలు ఎలా ఉంటాయో అస్సలు ఊహించరు. మాట జారితే వెనక్కి తీసుకోలేమని గుర్తుపెట్టుకోండి. ఎందుకంటే భర్తదే ఎప్పుడూ పైచేయి ఉండాలని కోరుకోవటం, పురషాహంకారం ఇటువంటి సమయాల్లోనే మేల్కొవటం జరుగుతుంది కాబట్టి, భార్య మనస్సును నొప్పిస్తారు. తరువాత మీరు క్షమించమని అడిగినా, సారీ అని ప్రాధేయపడినా, ఆమె మనస్సుకు అయిన గాయాన్ని మాన్పలేరు. కాబట్టి, వాదనలో ఉన్నప్పుడు కొన్ని విషయాలను గుర్తుపెట్టుకొని మాట్లాడాలని తెలుసుకోండి.

## శత్రువులు కాదు.. పరుష మాటలు వద్దు!

భార్యభర్తల మధ్య గొడవలు రావటం సహజమని గుర్తుపెట్టుకోవాలి. పంతానికి పోయి.. శత్రువులుగా భావించకండి. వాదనలో ఉన్నప్పుడు భార్యను పరుష పదజాలంతో నిందించవద్దు. చిన్నచిన్న తగాదాలనే పెద్దగా మార్చుకోవద్దు. తప్పు ఇద్దరిలో ఎవరిదైనా సారీ అన్న చిన్నమాటతో, గొడవను తెంచేయండి.. ఇద్దరి మధ్య బంధాన్ని పెంచుకోండి. కొన్నిసార్లు చిన్నచిన్న గొడవలే విడిపోవటానికి కారణాలు అవుతాయని గుర్తించుకోండి. వివాదాన్ని సాధ్యమైనంత మేరకు సద్దుమణేగేలా చూడటానికే ట్రైన చేయండి.

## ఇతరుల వద్ద అవమానించకండి




ఇంటికి బంధువులు వచ్చినప్పుడో, లేదా మీ ఆఫీస్ నుంచో, మీ స్నేహితులనో ఇంటికి తీసుకువచ్చినప్పుడు భార్యను కించపరచేలా మాట్లాడకండి. ఏమీ చేతకాదు.. అన్నీ నేనే చెప్పాలి.. నేను లేకపోతే పని చేతకాదు, పుట్టింట్లో ఏం నేర్పారో కూడా తెలియదు అంటూ అవమానించకండి. నేను లేకపోతే అస్సలు ఒక్కపని కూడా జరగదని అందరి ముందూ భార్యను తక్కువ చేయకండి. ఇది ఆమె మనసుపై తీవ్ర ప్రభావాన్ని చూపించవచ్చు. కొందరైతే, బంధువలు, స్నేహితులు, కొలీగ్స్ ఉన్నారని మరీ రెచ్చిపోయి, తన ఆధిపత్యాన్ని చూపించుకోవటానికి భార్య తప్పులేకుండా తిడుతుంటారు. భార్య చులకన అయితే, మీరు కూడా చులకన అయిపోతారనీ, మీకు కనీస మర్యాద ఇవ్వరని గుర్తించుకోండి.

## ఇద్దరూ ఓడినట్లే

మీ భార్య హౌస్ వైఫ్ అయితే, ఆమె పనులు ఆఫీసులో కంటే ఇంట్లోనే ఎక్కువ ఉంటాయని అర్థం చేసుకోండి. ఏపనీ చేయటం లేదంటూ చులకనగా మాట్లాడకండి. వివాదాల్లో భర్తలు భార్య వల్ల రూపాయి ఉపయోగం లేదనీ, నా జీతంతోనే ఇల్లు నడుస్తోందంటూ గొప్పలకు పోతుంటారు. కానీ ఆమె అహిర్నిశలు ఇంట్లో కష్టపడటం వల్లే ఇల్లు సవ్యంగా ఉందని ఆమె కష్టాన్ని కూడా గుర్తించండి. వివాదంలో ఎవరు ఓడినా ఇద్దరూ ఓడినట్లేనని గుర్తించుకోండి.

# మొబైల్‌ను బాత్రూంలో వాడుతున్నారా ?

ప్రస్తుతం జనరేషన్ యువతకు మొబైల్ ఫోన్‌లో శరీరంలో ఒక భాగమైపోయింది. ఎక్కడికి వెళ్లినా? ఏం చేస్తున్నా? చేతిలో ఫోన్ ఉండాల్సిందే. ఫోన్ ఒక్క క్షణం కనిపించలేదంటే ప్రాణం పోయినంత ఫీల్ అవుతారు. నిద్ర లేచిన మరుక్షణం వాళ్లు చూసేది కూడా దీనిని. నిద్ర లేచినప్పటి నుంచి మళ్ళీ నిద్రలోకి జారుకునే వారకు వారి దృష్టి దీనిపై అధికంగానే ఉంటుంది. ఈ మధ్య చాలా మంది తమ మొబైల్ ఫోన్‌ను బాత్రూమ్‌లోకి కూడా తీసుకెళ్తున్నారు. అయితే.. మొబైల్ ఫోన్‌తో బాత్రూంకు తీసుకెళ్లే అలవాటు మిమ్మల్ని అనారోగ్యానికి గురి చేస్తుంది. మీరు లేక మీ కుటుంబ సభ్యులు టాయిలెట్ నుంచి ప్రమాదకర బ్యాక్టీరియాను ఇంట్లోకి తెస్తారు. ఇది పలు అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. అసలే కరోనా వైరస్ లాంటి వ్యాధులు ప్రపంచ దేశాలను కలవరానికి గురి చేస్తున్నాయి. గతంలో పెద్దవారిలో మాత్రమే కనిపించే పైల్స్ సమస్య ఇప్పుడు యువతో కూడా సాధరణమైంది. పైల్స్ సమస్య కారణంగా మీ మొబైల్‌ను టాయిలెట్‌కు తీసుకెళ్లడం చేస్తుంటారు. అయితే మీరు మొబైల్‌తో బాత్రూమ్‌లో కూర్చున్నప్పుడు, ఫోన్‌పైన మీ పూర్తి శ్రద్ధ ఉంటుంది. ఈ కారణంగా మీరు సాధారణ సమయం కన్నా అధిక సమయం టాయిలెట్‌లోనే కూర్చుంటారు. ఇలా చేయడం వల్ల హేమోరాయిడ్స్ అంటే పైల్స్ వచ్చే ప్రమాదం పెంచుతుంది. కాబట్టి ఇకనైనా మొబైల్ ఫోన్‌ను టాయిలెట్‌లోకి తీసుకువెళ్లకండి.



# ఒత్తిడిని పెంచే 11 ట్రిగర్స్



ఉరుకుల పరుగుల జీవితమో, కార్పొరేట్ ఉద్యోగాల వల్లో.. కారణం ఏదైనా ప్రస్తుత సమాజానికి ఒత్తిడి అతిపెద్ద రోగంగా మారుతోంది. ఒకేసారి వందపనులు చేయాల్సిన పరిస్థితి అందరూ ఎదుర్కొంటున్నారు. ఈ ఒత్తిడిని ఎలా ఎదుర్కొవాలో? అసలు తమకు ఎందుకు ఒత్తిడి పెరుగుతోందో? కూడా అర్థం కాక చాలా మంది సతమతమవుతుంటారు. దీనిని హ్యాండిల్ చేయడం కోసం నానా తిప్పలు పడుతుంటారు. డాక్టర్ల దగ్గరకి వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేస్తారు. అయితే అసలు ఒత్తిడికి కారణమవుతున్న ట్రిగర్స్‌ను తెలుసుకుంటే దీనిని ఈజీగా హ్యాండిల్ చేయొచ్చని నిపుణులు అంటున్నారు. కృత్రిమ వెలుతురు నుంచి ఒకేసారి చాలా పనులు చేయడం వరకు, మన ఒత్తిడిని పెంచే కొన్ని విషయాలు ఉన్నాయి. వీటిని మనం 'కార్టిసాల్ ట్రిగర్స్' అంటాం. కార్టిసాల్ అంటే 'ఒత్తిడి హార్మోన్' అని కూడా అంటారు. దీని స్థాయిలు పెరిగితే మనకు తీవ్రమైన ఒత్తిడి కలుగుతుంది. అయితే, మన రోజువారీ అలవాట్లు, జీవనశైలి ఎలా సైలెంట్‌గా కార్టిసాల్ స్థాయిలను పెంచుతాయో చాలా మంది గుర్తించరు. "దీర్ఘకాలికంగా కార్టిసాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటే మీరు అలసిపోయినట్లుగా, చికాకుగా అనిపిస్తుంది. ఇది మెటబాలిజం, మానసిక స్థితి, జ్ఞాపకశక్తి, హార్మోన్లను దెబ్బతీస్తుంది. పొట్ట చుట్టూ కొవ్వు పెంచుతుంది. కండరాలను బలహీనపరుస్తుంది. ఆసక్తిని తగ్గిస్తుంది. నిద్రను పాడు చేస్తుంది. సెరోటోనిన్, డోపమైన్ వంటి సంతోషాన్నిచ్చే మెదడు రసాయనాలను అదుపు తప్పిస్తుంది" అని టామ్ ఒత్తిడి శరీరంపై చూపించే ప్రభావం గురించి వివరించారు.

**ఫోన్ నోటిఫికేషన్ శబ్దాలు:** ఫోన్ మోగేటప్పుడు లేదా వైబ్రేట్ అయినప్పుడు వచ్చే శబ్దాలు, ఏదో ఒక పని చేయాలనో, ఏదో ప్రమాదం ఉందనో మనసును ఆందోళనకు గురి చేస్తాయి. మనం వెంటనే స్పందించకపోయినా, మన నాడీ వ్యవస్థ దానికి ప్రతిస్పందిస్తుంది.
**గ్రూప్ టెక్ట్స్ మెసేజ్‌లు:** గ్రూప్‌లో ఇతరులు పంపిన టెక్ట్స్ మెసేజ్‌లతో సామాజికంగా కనెక్ట్ అయి ఉండాలని, అప్‌డేట్‌గా ఉండాలని మెదడు ఒత్తిడికి గురవుతుంది.
**నిరంతరాయంగా వచ్చే వాతావరణ శబ్దాలు:** తక్కువ స్థాయిలో బ్యాక్‌గ్రౌండ్ నాయిస్, అంటే కూలర్ సౌండ్ లేదా ట్రాఫిక్ శబ్దం వంటివి ఒత్తిడిని కలిగించగలవు.

**ఫోన్ నోటిఫికేషన్ శబ్దాలు:** ఫోన్ మోగేటప్పుడు లేదా వైబ్రేట్ అయినప్పుడు వచ్చే శబ్దాలు, ఏదో ఒక పని చేయాలనో, ఏదో ప్రమాదం ఉందనో మనసును ఆందోళనకు గురి చేస్తాయి. మనం వెంటనే స్పందించకపోయినా, మన నాడీ వ్యవస్థ దానికి ప్రతిస్పందిస్తుంది.

**గ్రూప్ టెక్ట్స్ మెసేజ్‌లు:** గ్రూప్‌లో ఇతరులు పంపిన టెక్ట్స్ మెసేజ్‌లతో సామాజికంగా కనెక్ట్ అయి ఉండాలని, అప్‌డేట్‌గా ఉండాలని మెదడు ఒత్తిడికి గురవుతుంది.

**నిరంతరాయంగా వచ్చే వాతావరణ శబ్దాలు:** తక్కువ స్థాయిలో బ్యాక్‌గ్రౌండ్ నాయిస్, అంటే కూలర్ సౌండ్ లేదా ట్రాఫిక్ శబ్దం వంటివి ఒత్తిడిని కలిగించగలవు.

**తప్పుడు సమయంలో కృత్రిమ వెలుతురు:** ఉదయం పూట మనకు సహజమైన సూర్యరశ్మి దొరకనప్పుడు, పగటిపూట కృత్రిమ లేదా LED లైట్ల వెలుతురు మన శరీరం యొక్క కార్టిసాల్ లయను దెబ్బతీస్తుంది.

**ఎక్కువ మోటివేషనల్ కంటెంట్:** మనం ఎక్కువ మోటివేషనల్ కంటెంట్, హజిల్ కల్చర్ రీల్స్‌కు గురైనప్పుడు, మెదడు వాటిని ప్రమాదాలుగా అర్థం చేసుకుంటుంది. మనం తగినంత కృషి చేయడంలేదని భావిస్తాం.

**ఒకేసారి చాలా పనులు చేయడం:** ఒకటి కంటే ఎక్కువ పనులు ఒకేసారి చేస్తే పనులు తొందరగా అయిపోతాయని అనుకుంటాం. కానీ అది మనసులో ఒక రకమైన గందరగోళాన్ని సృష్టిస్తుంది.

**సోషల్ మీడియాను ఆసక్తి లేకుండా చూడటం:** సోషల్ మీడియాలో ఏదో చూస్తున్నామని తెలియకుండా స్క్రోల్ చేస్తూ పోతే, అది శరీరంలో కార్టిసాల్ స్థాయిలను పెంచడం, తగ్గించడం వంటివి చేస్తుంది.

**వడపోత లేని వార్తలు లేదా సంక్షోభ హెడ్‌లైన్‌లు:** మనపై ప్రభావం చూపడం లేదని మనం అనుకున్నా, 5 నిమిషాల పాటు భయానక వార్తలను చూడటం కొన్ని గంటల పాటు మన కార్టిసాల్ స్థాయిలను ప్రభావితం చేస్తుంది.

**ఒకే భంగిమలో ఎక్కువ సేపు కూర్చోవడం:** నిశ్చల జీవనశైలి రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది. కీళ్లలో ఒత్తిడిని సృష్టిస్తుంది. అలాగే కార్టిసాల్ స్థాయిలను కూడా దెబ్బతీస్తుంది.

**విసుగు:** దీర్ఘకాలికంగా విసుగు, సృజనాత్మక ఉత్సాహం లేకపోవడం మానసిక ఒత్తిడికి దారితీస్తుంది.

**వైఫై ఓవర్‌లోడ్:** మనం నిద్రపోతున్నప్పుడు వైర్‌లెస్ సిగ్నల్‌స్‌కు నిరంతరం గురికావడం మెదడు యొక్క కార్యకలాపాలను ప్రభావితం చేస్తుంది.

## హీరోగా సెన్సేషనల్ దర్శకుడు.. నిర్మాతగా సౌందర్య రజనీకాంత్



ఈ ఏడాది 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో సూపర్ హిట్‌ను సొంతం చేసుకొని సెన్సేషన్ క్రియేట్ చేశారు దర్శకుడు అభిషన్ జీవింత్. ఇప్పుడాయన మెగాఫోన్ పక్కన పెట్టి హీరోగా అలరించేందుకు సిద్ధమయ్యారు. అభిషన్ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. సౌందర్య రజనీకాంత్ నిర్మాణ సంస్థ జియాన్ పిక్చర్స్, ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించనున్న ప్రాజెక్ట్‌తో అభిషన్ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నారు. మదన్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందనుంది. ఇందులో అభిషన్ సరసన మలయాళ నటి అనశ్వర రాజన్ కనిపించనున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు తెలిపింది.

అభిషన్ ఈ ఏడాది 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. కేవలం రూ.7 కోట్లతో చిన్న సినిమాగా విడుదలై ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద రూ.90 కోట్లు వసూలు చేసి నిర్మాతకు 1200 శాతం లాభాలను తెచ్చింది. దీంతో ఈ దర్శకుడు తర్వాత ఏ సినిమా తీస్తారా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో తనే హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నట్లు అధికారికంగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

## లోకేశ్‌కు జతగా బ్యూటిఫుల్ హీరోయిన్..



ఖైదీ, విక్రమ్, కూలీ వంటి యాక్షన్ చిత్రాలతో తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకున్నాడు డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్. ఇప్పటి వరకు ఈయన డైరెక్టర్‌గానే కాకుండా సమర్పకుడిగా కూడా పలు సినిమాలు తెరకెక్కించాడు. అయితే.. ఈయన ఇప్పుడు హీరోగా మారుతున్నట్లు ఇప్పటికే సోషల్ మీడియాలో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే.. గతంలో శృతి హాసన్‌తో కలిసి లోకేశ్ ఒక మ్యూజిక్ ఆల్బమ్‌లో కూడా నటించడంతో ఆయన నటనకు మంచి మార్కులే పడ్డాయి. దీంతో లోకేశ్ హీరోగా వస్తున్న సినిమా అనౌన్స్‌మెంట్ కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు.

దీనికి 'కెప్టెన్ మిల్లర్' ఫేమ్ డైరెక్టర్ అరుణ్ మతేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నట్లు తెలుస్తుండగా.. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నా ఈ సినిమాలో హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ మిర్నా మీనన్‌ను ఫైనల్ చేశారట మేకర్స్. కాగా.. ఈ సినిమాపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే రాబోతున్నట్లు కోలీవుడ్ వర్గాల నుంచి సమాచారం.

## ఆ పాత్రలో నటించి చాలా బాధ పడ్డా..



'గోవిందుడు అందరివాడేలే' సినిమా చేసి తప్పు చేశాను అంటుంది ఒకప్పటి బ్యూటీ కమలినీ ముఖర్జీ. 2004లో 'ఫిర్ మిలేంగే' అనే హిందీ సినిమాతో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది కమలినీ ముఖర్జీ. తర్వాత 'ఆనంద్' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే మంచి క్లాసికల్ హిట్ అందుకున్న ఈమె 'గోదావరి', 'హ్యాపీ డేస్', 'గమ్యం', 'జల్సా' వంటి మరెన్నో మూవీస్‌తో మంచి హిట్స్ అందుకున్న ఫాలోయింగ్ కూడా సొంతం చేసుకుంది. ఇక తెలుగులో 'గోవిందుడు అందరివాడేలే' సినిమాలో నటించిన ఈ హీరోయిన్.. ఇప్పటి వరకు మరో చిత్రంలో కనిపించలేదు. అలాగే సోషల్ మీడియాకు కూడా పూర్తిగా దూరంగా ఉంటుంది.

ఇదిలా ఉంటే.. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ హీరోయిన్ రామ్ చరణ్ 'గోవిందుడు అందరివాడేలే' సినిమాపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'గోవిందుడు అందరివాడేలేలో నా పాత్ర నాకు అసలు నచ్చలేదు. కాబట్టి చివరి వరకు ఆ సినిమా నాకు అసమర్థంగా అనిపించింది. ఆ తర్వాత నాకు బాధగా అనిపించి కొంతకాలం తెలుగు సినిమాల నుండి తప్పకున్నాను' అని తెలిపింది. అలాగే కింగ్ నాగార్జున గురించి మాట్లాడుతూ.. 'అక్కినేని నాగార్జున నిజంగా చాలా హాట్‌గా ఉంటారు. నేను ఆయన్ని ఎప్పుడు సూపర్ హాట్‌గా చూసేదాన్ని అని చెప్పడానికి చెప్పడానికి ఎలాంటి డౌట్ లేదు. అయితే.. మేము ఇద్దం కలిసి నటించిన చిత్రంలో ఆయన సాయి బాబా కాబట్టి.. అంతా హాట్‌గా చూడలేకపోయా.. కానీ షూటింగ్ మాత్రం ఎంజాయ్ చేశాము' అని తెలిపింది. చివరిగా 'మన్యం పులి'లో నటించిన ఈ అమ్మడు ప్రస్తుతం వెండితెరకు దూరంగా ఉంటుంది.


## 'అఖండ 2' వాయిదా..



నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ' బ్లాక్ బస్టర్ హిట్ అందుకోగా.. ఇప్పుడు దానికి సీక్వెల్‌గా 'అఖండ2' రాబోతుంది. ఫ్యాన్స్‌తో పాటు సినీ ప్రియుల్లో కూడా భారీ అంచనాలు ఉన్న ఈ మూవీ సెప్టెంబర్ 25న రిలీజ్ కాబోతున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం ప్రకటించింది. అయితే.. ఈ సినిమా వాయిదా పడే అవకాశం ఉన్నట్లు గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా దీనిపై క్లారిటీ ఇస్తూ బాంబ్ పేల్చింది మూవీ యూనిట్.

అఖండ2 వాయిదా పడినట్లు తెలుపుతూ.. 'గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీనుల బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో అఖండ 2 రాబోతుంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనింగ్ చిత్రాన్ని ప్రకటించినప్పటి నుండి.. ఇండియా సినిమాల్లో మోస్ట్ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. అలాగే.. ఇందులో నుంచి వచ్చిన టీజర్ అన్ని భాషల్లో సంచలనం సృష్టించి సినిమాపై సరికొత్త అంచనాలను క్రియేట్ చేసింది. మరి ఈ స్థాయి సినిమాకి.. రీరికార్డింగ్, VFX అండ్ మొత్తం పోస్ట్‌ప్రొడక్షన్ ప్రక్రియకు చాలా శ్రద్ధ అవసరం. అందువల్ల భారీ అంచనాలు ఉన్న ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావాలంటే మాకు అదనపు సమయం అవసరం. మొదటి భాగం బ్లాక్ బస్టర్ విజయం తర్వాత.. అఖండ 2 ప్రాజెక్ట్ గురించి టీమ్ ఎంతో ఉత్సాహంగా ఉంది. భారీ స్థాయిలో ఎక్కడ రాజీపడకుండా నాణ్యత, ఉత్కంఠభరితమైన విజువల్స్ తో అందించేందుకు టీమ్ విశ్రాంతి లేకుండా 24 గంటలూ కృషి చేస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని మొదటగా ప్రకటించిన సెప్టెంబర్ 25 కి కాకుండా.. ముందుకు తీసుకెళ్తున్నాము. త్వరలో కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాము. మరింత ఎక్సైటింగ్‌గా ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులకు వేచి ఉంటారని ఆశిస్తున్నాము.. అఖండ 2 కేవలం సినిమా కాదు.. అది ఒక సినిమా పండుగ' అని తెలిపారు.

## రాజాసాబ్ రిలీజ్ డేట్ ఫిక్స్..



డార్లింగ్ ప్రభాస్ నటిస్తున్న 'ది రాజాసాబ్' మూవీ రిలీజ్‌పై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. ఫ్యాన్స్ అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్ ఎన్నోసార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఇక ఫైనల్‌గా డిసెంబర్ 5న రిలీజ్ చేసేందుకు సిద్ధం అవ్వగా.. ఈ డేట్ కూడా మారినట్లు నెట్టింట వార్తలు వైరల్ అయ్యాయి. ఫైనల్‌గా 'ది రాజాసాబ్' రిలీజ్‌పై ఇప్పటికి క్లారిటీ వచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత విశ్వ ప్రసాద్ రాజాసాబ్ చిత్రాన్ని వచ్చే ఏడాది పండుగ స్పెషల్‌గా జనవరి 9న రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు.

అంతే కాకుండా.. ఈ సినిమా నుంచి ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు రెండు ట్రైలర్స్ కట్ చేశారట మేకర్స్. అక్టోబర్‌లో ట్రైలర్ 1ను రిలీజ్ చేయనుండగా.. డిసెంబర్‌లో రిలీజ్ ట్రైలర్ ప్లాన్ చేశారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన న్యూస్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ మూవీకి మారుతి దర్శకత్వం వహిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇందులో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999